ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.50 (307.5790)	10,461	51,517
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.60 (4.36)	2,156.06	2,464.91
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.587 (43.5968)	35,233	65,064

చికెన్ ధరలు	లైవ్ : రూ.150	డ్రెస్ : రూ.220	స్కిన్‌లెస్ : రూ.240



గేటుకు తాళం వేయడంతో బయట నిలబడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు(ఫైల్)

అద్దెల కోసం నిరీక్షణ

మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహిస్తున్న అద్దె భవనాలకు ప్రభుత్వం అద్దెలు చెల్లించడం లేదు. దీంతో యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో నే విసిగిపోయిన జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనయజమాని ఈ నెల 10న పాఠశాలకు తాళం వేశారు. అద్దె చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తుండటంతో చెప్పి మరీ తాళం వేశారు. దీంతో ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు చెట్ల కిందనే ఉండిపోవాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ఎంఈవో యజమానితో మాట్లాడి తిరిగి తాళం తీయించారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట టౌన్)

» మూడు, నాలుగేళ్లుగా బకాయిలు » రూ.లక్షల్లో పేరుకుపోవడంతో ఇబ్బందులు

తిలక్‌నగర్ ప్రాథమిక పాఠశాల కోసం నెలకు రూ.18,500 చొప్పున అద్దెకు తీసుకున్నారు. ఈ పాఠశాలలో 88మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే 30 నెలలుగా అద్దె చెల్లించడం లేదు. దీంతో మొత్తం రూ.5,55,000లు బకాయిలు పేరుకుపోయాయి. అదేవిధంగా తిలక్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సైతం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఈ భవనానికి ప్రతినెలా రూ.26,100 అద్దె చెల్లించాల్సి ఉంది. అయితే నాలుగేళ్లుగా చెల్లించడంలేదు. అలాగే కుమ్మరివాడ, అంబేడ్కర్‌నగర్‌లోని రెండు ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలు సైతం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీరికి సైతం నాలుగేళ్లుగా బకాయి ఉంది. జిల్లాకేంద్రంలో ఉన్నత పాఠశాలలు 10 ఉండగా ఒకటి అద్దె భవనంలో, 16 ప్రాథమిక పాఠశాలలకు మూడు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

జిల్లా కేంద్రంలోనే అధిక సమస్య

జిల్లాలో 600 ప్రాథమిక పాఠశాలలు, 76 ప్రాథమికోన్నత పాఠశాలలు, 180 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 99,094 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో నాలుగు పాఠశాలలు మాత్రమే అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మొత్తంగా జిల్లాలో ఆరు పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కన్నా జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సంఖ్య అధికంగా ఉంది. దానికి తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. తిలక్‌నగర్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వతరగతి వరకు చదివే విద్యార్థులు 150మందికి పైగా ఉన్నారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వతరగతి చదివే విద్యార్థులు 88 మంది ఉన్నారు. వీటితో పాటు జిల్లా కేంద్రంలో ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. దీనికి అనుగుణంగా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకుండా ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు క్రీడా మైదానాలు లేకుండా ఉన్నాయి. మరికొన్ని పాఠశాలలకు సరైన వెలుతురు లేని గదులు ఉన్నాయి. మరికొన్ని పాఠశాలల చుట్టూ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేవు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

భవన యజమానులకు ఆర్థిక ఇబ్బందులు

భవన యజమానులు ఒక్కొక్క భవనానికి అద్దె సుమారు...

- మిగతా 8వ పేజీలో...

సబ్‌మార్కెట్ పడావు

» 20 ఏళ్లుగా నిరుపయోగం » క్రయవిక్రయాలకు నోచుకోని వైనం



సాగర్ సిమెంట్ సమీపంలో ఖాళీగా కంపచెట్లతో ఉన్న సబ్ మార్కెట్ గోదాంలు

మఠంపల్లి మండలంలోని వ్యవసాయ సబ్‌మార్కెట్ అలంకారప్రాయంగా మారింది. హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఈ సబ్‌మార్కెట్ 20 ఏళ్లకిందట ఏర్పాటు చేయగా ఏనాడూ రైతులకు ఉపయోగపడలేదు. దశాబ్దాల తరబడి ఇదే తంతు కొనసాగుతున్నా మార్కెటింగ్ శాఖ దిద్దుబాటు చర్యలపై దృష్టి సారించలేదు. వెరసి ఆశించిన లక్ష్యం నెరవేరకపోగా వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించడానికి రైతులు నానాతంటాలు పడుతున్నారు. పంటలను తక్కువ ధరకు మిల్లర్లకు విక్రయించి నష్టపోతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

నాగార్జునసాగర్ ఆయకట్టులో చివరి మండలం మఠంపల్లి. ఈ మండలంలోని 29 పంచాయతీల్లో సుమారు 19వేల ఎకరాల్లో వరి పంట చేశారు. గత దాది సుమారు 20 వేల ఎకరాలు బావులు, బోర్లు, ఎత్తిపోతల కింద సాగు చేసిన రైతులు సుమారు 41,800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించారు. ఇతర మెట్ట పంటలు మరో 6 వేల నుంచి 7వేల ఎకరాల్లో సాగు చేశారు. మండలంలో ఎక్కువశాతం సన్నరకం ధాన్యాన్ని రైతులు సాగు చేస్తున్నారు. ఈ ధాన్యానికి రూ.2000 నుంచి రూ.2800లు పైచిలుకు ధరలు పలుకుతుంటాయి. దీనికి తోడు ప్రభుత్వం అందించే రూ.500 అదనంగా రైతులకు అందాల్సి ఉంటుంది.

సిబ్బంది ఏరీ?

హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో భాగంగా మఠంపల్లి మండల కేంద్రంలో 20ఏళ్ల కిందట సబ్ మార్కెట్ ఏర్పాటుచేశారు.

- మిగతా 8వ పేజీలో...

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన నేడు



హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన ప్రారంభించనున్నారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని యంగ్‌ఇండియా స్కూల్ వరకు రూ.8.28 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన, మల్లయ్యగూడెంలో రూ.70లక్షలతో నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన, పొనుగోడులో 3.15 కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన, పొనుగోడులో రూ.50లక్షలతో నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పొనుగోడు ఊరచెరువులో చేపపిల్లలను వదిలిపెట్టనున్నారు. అనంతరం గరిడేపల్లి నుండి అలింగాపురం వరకు రూ.18.96 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డును ప్రారంభించనున్నారు. పాలకవీడు మండలం మూసీఒడ్డు సింగారంలో రూ.1.8 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన, యల్లాపురంలో రూ.3.2 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన, పాలకవీడు మండలం బెట్టెతండాలో రూ.3.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన, మఠంపల్లి మండలం బక్కమంతులగూడెంలో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించనున్నారు. అదేవిధంగా మేళ్లచెర్వు మండలంలో రూ.3 కోట్లతో రేవూరు వరకు నిర్మించనున్న ఫోర్ వే లైన్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం చింతలపాలెంలో రూ.45 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనానిన ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

ఫిర్యాదులు, కేసుల నమోదులో జాప్యం చేయొద్దు



చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ నర్సింహ

చివ్వెంల నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులు, కేసుల నమోదులో జాప్యం చేయొద్దని ఎస్పీ నర్సింహ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం చివ్వెంల పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని, వారితో గౌరవంగా నడుచుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై వెంటనే త్వరితగతిన స్పందించి ప్రాథమిక విచారణ చేసి బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సిబ్బంది తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

అందరూ కలిసి జట్టుగా ప్రజలకు సేవ చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విజువల్ పోలీసింగ్ నిర్వర్తించాలని కోరారు. సిబ్బంది డయల్ 100నంబరుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.రాత్రి సమయంలో పకడ్బందీగా పెట్రోలింగ్ చేయాలని,స్టేషన్ పరిధిలో జాతీయ రహదారులు ఉన్నందున వాటి వెంట నిఘా ఉంచాలన్నారు. రోడ్డు భద్రతపై మండల ప్రజలకు అవగాహన కల్పించి, ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న ఫిర్యాదుదారులతో మట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పరిసరాలు, ఫిర్యాదుల నిర్వహణ, రిసెప్షన్‌మెనేజ్‌మెంట్ తదితర అంశాలను పరిశీలించారు. ఎస్పీ వెంట ఎస్ఐ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ప్రతి పశువుకూ క్యూఆర్ కోడ్

కోదాడ రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి పశువుకూ క్యూఆర్ కోడ్ చెవిపోగు, గాలికుంటు వ్యాధి నిరోధన టీకాలు వేస్తున్నామని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి దామరచర్ల శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కోదాడలోని ప్రాంతీయ పశువైద్యశాల ప్రాంగణంలో కోదాడ, అనంతగిరి, చింతలపాలెం మండలాల సిబ్బందితో పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకా పురోభివృద్ధిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గాలికుంటు వ్యాధి సమూల నిర్మూలనలో భాగంగా జిల్లావ్యాప్తంగా టీకా పురోగతిలో ఉందని, ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు, సిబ్బంది కొరత తదితర కారణాలతో చింతలపాలెం మండలంలో పురోగతి మందగించిందని అన్నారు. దీంతో కోదాడ, అనంతగిరి మండలాల నుంచి సిబ్బందిని రెండురోజుల పాటు చింతలపాలెంకు కేటాయిస్తూ ఏడు టీంలు తయారు చేసి ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ఆ మండలంలో వంద శాతం టీకా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా పశుపోషకులు తమ పశువులన్నింటికీ చెవిపోగులు, గాలికుంటు టీకా వేయించుకునేలా గ్రామాల్లో ప్రచారం కల్పించి టీకా, చెవి పోగుల కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య, కోదాడ, చింతలపాలెం, అనంతగిరి మండలాల పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు బి.మధు, సిరిపురపు సురేంద్ర, మూడు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయం

సూర్యాపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆజాద్ జయంతి రోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. జర్నలిజంలో అపార అనుభవంతో ఉర్దూ పత్రికను నెలకొల్పి సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాపేందుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, పలువురు మైనార్టీ నాయకులు కలీం అహ్మద్, అబూకర్ సిద్దీఖ్, అంజదఅలీ, బడేసాహెబ్, జాఫర్ షేక్, ఖలీల్‌అహ్మద్, అఫ్రీజ్, శంకర్ పాల్గొన్నారు.



మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్నర్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. వారంరోజుల్లో జిల్లాలోని 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఏరియా ఆసుపత్రులుల్లో సర్వే నిర్వహించామని అన్నడ ఉన్న సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పులుసు సత్యం, సోమపంగు జానయ్య, పోసనబోయిన హుస్సేన్, మిట్టపల్లి లక్ష్మి, గుంజ వెంకటేశ్వర్లు, కడెం కుమార్, పెరుమాళ్ల రాజారావు, అంజపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల తొలి అడుగు పదో తరగతి

తిరుమలగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుకు తొలి అడుగు పదో తరగతి అని కలెక్టర్ అన్నారు. మంగళవారం తిరుమలగిరిలోని ఉన్నత పాఠశాల, ప్రభుత్వజూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పుస్తకాలు, సిలబస్, మధ్యాహ్న భోజనం బోధనాంశాల సమస్యలపై వాకబుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మృత్యుంజ, దామెర శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగులు చేయాలి

తిరుమలగిరి రూరల్ : సరైన తేమ శాతంతో కొనుగోలు కేంద్రాలు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని తొండ, కోక్యానాయక్‌తండ గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను తనిఖీచేశారు. కోక్యానాయక్‌తండా కొనుగోలు కేంద్రంలో ధాన్యం డ్రయర్‌ను పరిశీలించారు. వివిధ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ రాము, తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, వ్యవసాయ అధికారి నాగేశ్వారావు, ఎంపీడీఓ లాజర్, నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొదు

మద్దిరాల : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని కలెక్టర్ అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కాంటాలు తప్పుగా వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ ఆయేషాపర్వీనా, ఏపీఎం శ్రీనివాస్, సీఐనర్సింహ,ఎస్‌ఐవీరన్న పాల్గొన్నారు.

మద్దతు ధర పొందాలి

తుంగతుర్తి, నాగారం: నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని తెచ్చి మద్దతు ధర పొందాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం తుంగతుర్తిలోని పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను, నాగనారం మండలం ఫణిగిరి, పస్తాల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు ఆయన పరిశీలించి, మాట్లాడారు. తేమ, తరుగు పేరుతో మిల్లర్లు ఇబ్బందులు పెడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మిల్లర్లతో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసీల్దార్లుదయానందం,హరికిషోర్‌శర్మ, ఎంపీడీవో శేషకుమార్, భీంసింగ్, సొసైటీ సీఈవో శేర్ల యాదగిరి, ఆర్ఐ శ్రీనివాస్, ఐకేపీ నిర్వాహకులు లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి నెలా సెల్‌ఫోన్లు రికవరీ చేస్తున్నాం

సూర్యాపేటక్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ పోర్టల్ ద్వారా ప్రతతి నెలా 100కు పైగా సెల్‌ఫోన్లు రికవరీ చేస్తున్నామని ఎస్పీ నర్సింహ అన్నారు. వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న 102 సెల్‌ఫోన్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో యజమానులకు అందజేసి, మాట్లాడారు. ఈ ఏడాది 7వ దఫా మొబైల్ మేళా నిర్వహించి, రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు 2,340 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. ప్రజలు, ఆస్తుల రక్షణలో పోలీస్ శాఖ అనుక్షణం పనిచేస్తోందన్నారు. పోలీస్ శాఖ కృతనిశ్చయంతో పనిచేసి ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయవద్దని సూచించారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీపుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటీకోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ నర్సింహ

అంగరంగ వైభవంగా లక్ష పుష్పయాగం



నేరేడుచర్ల శ్రీ కోదండరామాలయంలో నిర్వహించిన లక్ష పుష్పయాగం

నేరేడుచర్ల, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని నేరేడుచర్ల పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో మంగళవారం లక్ష పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు బృందావనం శ్రీరామ నర్సింహ తేజ, అర్చకుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించి స్వామి వారిని పల్లకీలో కల్యాణ మండపంలోకి తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. 14 రకాల పూలతో పాటు తులసి, మరమంతో కలిసి లక్ష పుష్పయాగం చేయడంతో స్వామి వారి మండపం మొత్తం పూలతో నిండింది. అనంతరం విష్వక్షేశ ఆరాధన, పుణ్యాహవచనం, చతుర్థ కలశ స్థాపన, అభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణ, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ రవీందర్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, భక్తులు రావులపల్లి ప్రసాద్, కొణతం చిన వెంకటరెడ్డి, నాగండ్ల శ్రీధర్, పూర్ణచంద్రారెడ్డి, నాగమాధవ్, వెంకటరెడ్డి, సీతారాంరెడ్డి, జంగయ్య, వీరయ్య, శివ, శ్రీను, హరి, లచ్చిరెడ్డి, చిన్నయ్య, సత్యనారాయణరెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు



కొత్తబస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

సూర్యాపేటక్రైం, హుజూర్‌నగర్, కోదాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో మంగళశారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీ లు చేపట్టారు. ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ఆదేశాల మేరకు పౌరుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా డాగ్‌స్క్వాడ్, బాంబ్‌స్క్వాడ్ సిబ్బంది జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్, హైటెక్ బస్టాండ్ ప్రాంగణాల్లో, దుకాణాల్లో, బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రద్దీగా ఉన్న వివిధ ప్రాంతాలలో బాంబ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు, గుర్తింపు కార్డులు లేని వారికి లా డ్జీలలో వసతి కల్పించవద్దని సీఐ చరమందరాజు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ బండి మోహన్, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా కోదాడ పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. బస్‌స్టేషన్, కూరగాయల మార్కెట్, షాపింగ్ మాల్స్ వద్ద స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు చేశారు. దుకాణాలు, బస్సులు, ప్రయాణికు లగేజీ, అనుమానిత వ్యక్తులను తనిఖీచేశారు.

దాతల సాయం అభినందనీయం

నూతనకల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు సాయం అందించడం అభినందనీయమని డీఈవో అశోక్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాతులోతు రమేష్, అశోక్, పాగ్యా దేవీలాల్, కమలేష్ అందించిన రూ.60వేల విలువైన క్రీడా దుస్తులను 140 మంది విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. కార్యక్రమంలో నూతనకల్, ఆత్మకూరు(ఎస్) ఎంఈవోలు రాములునాయక్, ధారాసింగ్, గోపగాని సోమయ్య, సత్యనారాయణ, బిక్షం, మదుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే గండమే...



వివరాలు 8లో



ప్రకృతి అందాల నెలవు యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట క్షేత్రం సమీపంలోని ప్రకృతి అందాలు పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న భక్తులను ఆలయ పరిసర ప్రాంతాల చుట్టూ కొండలు, ఎత్తయిన భవంతులు, గడ్డి చెరువు ఆకట్టుకుంటున్నాయి. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణాన్ని ప్రకృతి ప్రేమికులు ఆస్వాదిస్తున్నారు.
ఫోటో: ఆంధ్రజ్యోతి-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి.

పొలం వద్ద స్టార్టర్‌బాక్స్‌లో పాము



రఘునాథపాలెంలోని రైతు పొలంలో స్టాటర్ బాక్సులో పాము

మఠంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో ఓ రైతు పొలంలో స్టార్టర్ బాక్సులో పాము కనిపించింది. గ్రామానికి చెందిన ఓ రైతు మోటరు రిపేరు రావడంతో స్థానికంగా ఉన్న ఎలక్ట్రీషియన్ జలీల్‌కు సమాచారం ఇచ్చాడు. మంగళవారం రైతు పొలానికి వెళ్లిన ఎలక్ట్రీషియన్ ప్యానెల్ బాక్సును తెరవగానే అందులో ఉన్న విష తాచుపాము బుస కొట్టింది. భయందోళనకు గురైన జలీల్ తప్పించుకొని బాక్సును పగులగొట్టి పామును చంపారు. రైతులు వ్యవసాయ పొలాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల అధికారులు సూచిస్తున్నారు.

భూమిలో వాటా ఇవ్వలేదంటూ కుమారుడి నిరసన



కొమ్మాల గ్రామంలో తల్లి ఇంటి ముందు ధర్నా చేస్తున్న కుమారుడు ఉపేందర్, ఆయన భార్యా, పిల్లలు

అర్వపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూమిలో వాటా ఇవ్వడంలేదంటూ కుమారుడు భార్యాపిల్లలతో కలిసి తల్లి ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కొమ్మాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కన్నెబోయిన మంగమ్మకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు ఉపేందర్ తనకు వాటా ఇవ్వకుండా తల్లితో పాటు తమ్ముడు కిరణ్ ఇబ్బందిపెడుతున్నారని మంగళవారం తల్లి ఇంటి ఎదుట నిరసనకు దిగారు. వంశపారంపర్యంగా వస్తున్న భూమిలో వాటా ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆరోపించారు. తనకు రావాల్సిన భూమిని పంపకం చేయకుండా అన్యాయం చేస్తున్నారని, తన వాటాకు రావాల్సిన భూమిని ఇప్పించాలని కోరారు.


360 కిలోల నల్లబెల్లం, పటిక బెల్లం స్వాధీనం



నాటుసారా తయారీ ముడిసరుకును ప్రదర్శిస్తున్న పోలీసులు

రామగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారీకి వినియోగించే 360 కిలోల పటిక, నల్లబెల్లంను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేష్ మంగళవారం తెలిపారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదాబాక్షపల్లి గ్రామానికి చెందిన పాండు తన కారులో హైదరాబాద్ నుంచి మండలంలోని పలు తండాలకు సరఫరా చేసేందుకు నల్లబెల్లం, పటికను తీసుకొస్తుంటాడు. ఎక్సైజ్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ ఆదేశాల మేరకు కుదాబాక్షపల్లి నుంచి శివన్నగూడెం రోడ్డు వైపు రూట్‌వాచ్ నిర్వహించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పాండు వద్ద నుంచి నల్లబెల్లం, పటికతో పాటు కారును స్వాధీన చేసుకుని నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ సందర్భంగా సీఐ రాకేష్ మాట్లాడుతూ చట్టవ్యతిరేకమైన నాటుసారా తయారు చేసినా, అందుకు ఉపయోగించే ముడి సరుకులు విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్‌ఐ మల్లేష్, సిబ్బంది శ్రీను, మహేష్, మనోహర్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



జానకిరామయ్య(ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరవరం గ్రామంలో గుండెపోటుతో రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన రైతు జిట్టబోయిన జానకిరామయ్య(82) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతదేహంపై పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ చరమందరాజు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడ్డ 16 మంది నిందితుల వివరాలను మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండలకేంద్రానికి చెందిన ఉప్పుటోళ్ల అమరలింగంకు విశాఖపట్నం జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి పరిచయస్తులైన మిర్యాలగూడకు చెందిన కొంతమంది యువకులకు విక్రయిస్తున్నాడు. యువకులు తమకు అవసరమైన మేరకు తాగి, మిగతాది ఇతరులకు విక్రయించేవారు. మిర్యాలగూడ పట్టణం సీతారాంపురం కాలనీకి చెందిన మహ్మద్ జునేద్‌అలీ, మహ్మద్ తాజుద్దీన్, శాంతినగర్‌కు చెందిన మహ్మద్‌గౌస్, భాగ్యనగర్‌కు చెందిన షేక్ జావిద్, బొడ్డు శ్యామ్, బొమ్మాజీ గౌతమ్‌నందా, ఎన్నెస్పీ క్యాంప్‌కు చెందిన పులిజాల లక్ష్మీనారాయణ అలియాస్ సాయి, బంగారుగడ్డకు చెందిన నాశబోయిన గణేష్‌లు ఎండుగంజాయి ప్యాకెట్లతో మంగళవారం మధ్యాహ్నం ఎన్నెస్పీ క్యాంప్ పక్క నిర్మానుష్య ప్రదేశంలో ఉండగా సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. అమరలింగం వద్ద కొనుగోలు చేస్తున్నట్లు వారు తెలిపారు. దీంతో 9 మంది నిందితులను అరెస్టు చేసి వారినుంచి 1.1 కిలో ఎండుగంజాయి ప్యాకెట్లు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.940నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

● స్థానిక ఓ వెంచర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సాయిరామ్ ద్వారా మిర్యాలగూడకు చెందిన ఆరుగురు యువకులు గంజాయికి అలవాటుపడ్డారు. ఎప్పటి మాదిరే సాయిరామ్ నుంచి 1.4 కిలోల గంజాయిని రూ.7200లకు కొనుగోలు చేసి పంచుకుంటున్న క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. నిందితుల్లో మిర్యాలగూడకు చెందిన షేక్ అఫ్రోజ్, షేక్ హైమద్, ననావత్ అశోక్, మహ్మద్ నసీరొద్దీన్, వల్లవాయి నవీన్, మల్లెబోయిన రాకేష్‌లు ఉన్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సాయిరామ్‌ను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన కేసుల్లో రెండున్నర కిలోల గంజయిని స్వాధీనపర్చుకొని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐలు నాగభూషణరావు, సోమనర్సయ్య, ఎస్‌ఐలు సైదిరెడ్డి, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో బాలుడు

కేతేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా చేస్తున్న నలుగురు యువకులతో పాటు మైనర్ బాలుడిని నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు పట్టుకున్నారు. మరో నలుగురు పరారయ్యారు. ఇందుకు సంబంధించి నల్లగొండ డీఎస్పీ కే.శివరాంరెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శాలిగౌరారం మండలం వంగమర్తికి చెందిన సోము సాయితేజ ఒడిషా రాష్ట్రంలో గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నాడు. తనకు తోడుగా స్వగ్రామానికి చెందిన అయిలపాక ప్రభును ఆంధ్రా, ఒడిషా సరిహద్దుల్లో తీసుకెళ్లి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తూ లాభాలు ఆర్జించారు. ఈ క్రమంలో వారికి సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పగిడిమర్రి మహేష్, కేతేపల్లి మమండలం బండపాలెం గ్రామానికి చెందిన వంగూరి ప్రేమ్‌కుమార్, కాసనగోడు గ్రామానికి చెందిన శ్రీపతి ఉదయ్‌తో పాటు ఓ మైనర్ బాలుడు పరిచయమయ్యారు. వీరంతా కలిసి గంజాయి సేవిస్తూ ఉమ్మడిగా వ్యాపారం చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. సాయితేజ, అయిలపాక ప్రభు నుంచి 10రోజుల క్రితం కొనుగోలు చేసిన రెండున్నర కిలోల గంజాయిని సాయితేజ ఇంట్లో దాచిపెట్టారు. వారు తాగగా మిగిలిన కిలోన్నర గంజాయిని పంచుకుని కేతేపల్లి మండలం గుడివాడ మీదుగా సూర్యాపేట జిల్లాకేంద్రానికి మూడు బైక్‌లపై ఏడుగురు వెళ్తున్నారు. కేతేపల్లి ఎస్‌ఐ సతీష్ తన సిబ్బందితో ఇప్పలగూడెం వద్ద మకాం వేసి వారిని పట్టుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో నారగోని వేణు, శ్రీపతి ఉదయ్‌లు పరారు కాగా సోము సాయితేజ, అయిలపాక ప్రభు, పగిడిమర్రి మహేష్ వంగూరి ప్రేమ్‌కుమార్‌తో పాటు మైనర్ బాలుడు పట్టుబడ్డారు. వీరినుంచి కిలోన్నర గంజాయి, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ శివరాంరెడ్డి వివరించారు. సమావేశంలో శాలిగౌరారం సీఐ కె.కొండల్‌రెడ్డి కేతేపల్లి ఎస్‌ఐ సతీష్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

నల్లగొండ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. మృతుల్లో గీత కార్మికుడు, రైతు, పంచాయతీ పంప్ ఆపరేటర్, ఒక బాలుడు ఉన్నారు. అజాగ్రత్త, అతివేగం వల్లే ప్రమాదాలు జరిగాయి.



శ్రీశైలం(ఫైల్)

నార్కట్‌పల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొని గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన మన్నెం శ్రీశైలం(40) కల్లుగీత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పనినిమిత్తం ద్విచక్రవాహనంపై నార్కట్‌పల్లి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. సన్‌షైన్ కాలనీ సమీపంలోని పెట్రోలు బంకు వద్ద వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ(ఎలక్ట్రికల్) బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై శ్రీశైలం అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీశైలం భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుమారుడి దుర్మరణం, తండ్రికి గాయాలు

కనగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్ర సమీపంలోని బ్రిడ్జిపై ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొట్టిన ఘటనలో పదేళ్ల బాలుడు మృతి చెందగా, అతని తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం డీఎంకుంటకు చెందిన ఏకుల త్రివేణ్ నార్కట్‌పల్లి నుంచి స్వగ్రామానికి కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో కనగల్ వాగు బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న త్రివేణ్‌కు రెండు కాళ్లు విరిగిపోగా, వెనుక కూర్చున్న కుమారుడు రూపజ్(10)కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వీరిని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రూపజ్ మృతి చెందగా, త్రివేణ్‌కు వైద్యులు చికిత్సను అందిస్తున్నారు. కనగల్ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పెదగోని మహేందర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. ఆటోడ్రైవర్ మహేందర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు వివరించారు. రూపజ్ తల్లి సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కారుఢీకొని పంప్ ఆపరేటర్



బజారయ్య(ఫైల్)

వేములపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో కారు ఢీకొని గ్రామపంచాయతీ పంప్ ఆపరేటర్ మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మాడ్గులపల్లి మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన అక్కనపల్లి బజారయ్య(54) గ్రామపంచాయతీ పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వేతనం బ్యాంక్ అకౌంట్‌లో జమకాగా మంగళవారం తెచ్చుకునేందుకు వేములపల్లి మండలకేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌కు బయలుదేరాడు. ఈ క్రమంలో సల్కునూరు ఎక్స్‌రోడ్డు వద్ద బస్సు ఎక్కిన బజారయ్య శెట్టిపాలెం ఎక్స్‌రోడ్డు వద్ద బస్సు దిగి నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి దాటుతుండగా నల్లగొండ వైపు నుంచి మిర్యాలగూడ వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బజారయ్య తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బజారయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బజారయ్య కుమారుడు నాగయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో రైతు

చింతపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి మండలం దేవత్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ఎరుకుల రాములు(45) పని నిమిత్తం ద్విచక్రవాహనంపై దేవత్‌పల్లి నుంచి చింతపల్లికి తిరిగి వెళ్తున్నాడు. నసర్లపల్లిగేట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలై రాములు అక్కడికక్కడే మృతి చెందారు. రాములు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

● ఉమ్మడి జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు



నల్లగొండ, భువనగిరి టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగనున్నాయి. నవంబరు 13వ తేదీ నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన 30 పరీక్ష కేంద్రాల్లో 16,827 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 12, యాదాద్రి భువనగిరి జిల్లాలో 9, సూర్యాపేట జిల్లాలో తొమ్మిది పరీక్ష కేంద్రా లు ఏర్పాటు చేశారు. వీటిలో 5,400 మంది మొదటి సెమిస్టర్, 5,830 మంది మూడో సెమిస్టర్, 5,597 మంది విద్యార్థులు ఐదో సెమిస్టర్ పరీక్షలు రాయనున్నారు. అలాగే అవే సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు కూడా జరగుతాయి. మొదటి రోజున ఉదయం 10 నుంచి ఒంటి గంటల వరకు మూడవ సెమిస్టర్, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు మూడో సెమిస్టర్, మరుసటి రోజు ఉదయం బ్యాక్‌లాగ్ పరీక్షలన్నీ కొనసాగుతాయి. అదే క్రమంలో పరీక్షలన్నీ కొనసాగుతాయి. పరీక్షలలో అవకతవకల నివారణకు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంజీయూ అధికారులు తెలిపారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కోదాడ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనం నడిపిన ఒకరికి కోర్టు ఒకరోజు జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ ట్రాఫిక్ ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మద్యం మత్తులో వాహనం నడుపుతున్న ఒకరిని కోదాడ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి సీహెచ్ సత్యనారాయణ ఎదుట ప్రవేశపెట్టగా అతడికి ఒకరోజు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

● సూర్యాపేటక్రైం : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదుగురిలో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానా మరో ముగ్గురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష అదేవిధంగా రూ.1000 జరిమానా, మరో ముగ్గురికి ఒక్కోక్కరికి రూ.1000 చొప్పున రూ.3వేలు జరిమానా విధించామన్నారు. వాహనదారులు మద్యం మత్తులో వాహనం నడపవద్దన్నారు.

వేములకొండ పీహెచ్‌సీలో అగ్నిప్రమాదం

వలిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో రూ.2లక్షలు విలువైన ఆస్తి నష్టం జరిగింది. ఆరోగ్య కేంద్రంలో సోమవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఈవో రమేష్, కంప్యూటర్ ఆపరేటర్ స్వామి గమనించి స్థానికుల సహాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే రూ.2లక్షలు విలువైన ఇన్వెర్టర్, స్టెబులైజర్, వీల్‌చైర్స్ కర్టన్‌లు కాలిపోయాయి. కొంతసేపటికి మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ఘటనలో రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

దేవరకొండలో దొంగతనం

దేవరకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నేతాళ్ల నాగరాజు ఇంట్లో మంగళవారం చోరి జరిగింది. నాగరాజు కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని రూ.30వేల నగదు అపహరించారని బాధితుడు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ వెంకటరెడ్డి తెలిపారు.

108లో ప్రసవం

అడ్డగూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : యాద్రాదిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో 108 వాహనంలో ఓ మహిళ ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. కోటమర్తి గ్రామానికి చెందిన ఎండీ ప్రవీణకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది ఆమెను సూర్యాపేట ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ భగత్ అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. మార్గమధ్యలోనే ఆమె పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని 108 వాహన సిబ్బంది తెలిపారు. ప్రసవానంతరం మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. తెలిపారు సకాలంలో స్పందించి ప్రసవం చేసిన 108 సిబ్బంది, పైలట్ సోమేశ్వర్‌కు ప్రవీణ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీటెక్ చదివాడు, విలాసాల కోసం దొంగగా మారాడు

● బంగారం చోరీ కేసులో

అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదివి ఉద్యోగం రాకపోవడంతో విలాసవంతమైన జీవితం గడిపేందుకు ఓ యువకుడు దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కాడు. కాగా దొంగతనం సొత్తుతో బెట్టింగ్‌లకు పాల్పడుతూ డబ్బు పోగొట్టుకుని చివరకు కటకటాలపాలయ్యారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన పెనుగొండ మల్లికార్జున్‌రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. దీంతో అనేక ఉద్యోగాలకు ప్రయత్నించి అవి రాకపోవడంతో దొంగగా మారాడు. బెట్టింగ్ ఆడుతూ బానిసగా మారి దొంగతనంతో వచ్చిన సొమ్మును విక్రయించి బెట్టింగ్ ఆడుతూ పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలోనే సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామంలో ఈ నెల 5న ముడెం గోపిరెడ్డి ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లగా గమనించిన మల్లికార్జున్‌రెడ్డి ఇంటి తాళం పరిసర ప్రాంతంలో కనుగొని ఇంట్లోకి ప్రవేశించాడు. బంగారు ఆభరణాలు, రూ.90వేల నగదు చోరీ చేశాడు. కాగా ఇదే నేరస్తుడు మల్లికార్జున్‌రెడ్డి చింతకాని మండలం పొద్దుటూరు గ్రామం, అనంతగిరి మండలం అమీనాబాద్‌లో తాళాలు వేసిన ఇళ్లు లక్ష్యంగా చేసుకుని చోరీలు చేసేవాడు. కాగా వేపలసింగారంలో దొంగిలించిన బంగారాన్ని కరగబోసి వాటిని విక్రయించేందుకు మిర్యాలగూడ వెళుతుండగా మంగళవారం ఎస్‌ఐ మోహన్‌బాబు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పట్టుబడ్డాడు. అనంతరం అతడిని విచారణ చేయగా పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. బీటెక్ చదివినా ఉద్యోగం రాకపోవడంతో ఇంటివద్దనే ఉంటూ విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు మల్లికార్జున్‌రెడ్డి దొంగతనాలు ఎంచుకొని వచ్చిన డబ్బుతో బెట్టింగ్‌లు ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడని సీఐ చరమందరాజు తెలిపారు. కాగా నిందితుడి వద్ద నుంచి రూ.2,85 లక్షల నగదు, సెల్‌ఫోన్, స్కూటర్, 51.78 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

గణితం.. నేర్చుకొండిలా

● విద్యార్థులకు లెక్కలు చెప్పిన యాదాద్రి జిల్లా కలెక్టర్



విద్యార్థులకు గణిత పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ లెక్కల మాస్టారుగా మారి మంగళవారం పాఠాలు బోధించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టర్ హనుమంతరావు భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి తానూ విద్యార్థిగా, క్యూలైన్‌లో నిలిచి మధ్యాహ్న భోజనం పట్టుకొని వారితోనే తిన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ఉపాధ్యాయులు చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు. విద్యార్థులకు గణిత పాఠాలు బోధించి ఉపాధ్యాయుడిగా వ్యవహరించారు. విద్యార్థులకు సరళమైన రీతిలో లెక్కలు చెప్పారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలు వండుతున్నారా? అని నిర్వాహకులను అడిగారు. బడిబాట కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపాలి

డీఈవో కే.సత్యనారాయణ



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న యాదాద్రి భువనగిరి డీఈవో సత్యనారాయణ

భువనగిరి గంజ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని డీఈవో కే.సత్యనారాయణ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాల క్రీడల అండర్-14, 17 బాల బాలికల చెస్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాస్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో కూడా విజయం సాధించి జాతీయస్థాయి పోటీలకు వెళ్లాలన్నారు. పోటీలకు ఉమ్మడి జిల్లా చెస్ క్రీడాకారులు 60మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడల కార్యదర్శి కందాడి దశరథరెడ్డి, చెస్ ఆర్బిటర్ మట్టయ్య, కే.వెంకటరమణ, శిరీష, ప్రతిభ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ప్రోత్సాహకానికి ప్రత్యేక పాలసీ

● సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్



పోటీలను ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): క్రీడల ప్రోత్సాహకానికి ప్రభుత్వం ప్రత్యేక పాలసీ రూపొందించిందని సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్ అన్నారు. పట్టణంలోని గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న బీసీ గురుకులాల జిల్లాస్థాయి పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. ప్రభుత్వాలు ప్రకటించిన నూతన క్రీడాపాలసీతో ఆటల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. అండర్-14, అండర్-19 విభాగాల్లో డిస్కస్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు శ్రావణి, గాయత్రి, స్పందన మొదటిస్థానాల్లో నిలిచారని ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంఈవోలు బాలునాయక్, బాలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఆర్టీఐపై అవగాహన

భువనగిరి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాల వారీగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. బుధవారం యాదాద్రి కలెక్టరేట్‌కు నలుగురు సమాచార కమిషనర్లు రానున్నారు. ఉదయం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని అనంతరం కలెక్టరేట్‌లో అన్ని శాఖల ప్రజా సమాచార అధికారులు, అప్పిలేట్ అధికారులతోపాటు ఇతర అధికారులకు అవగాహన కల్పిస్తారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై మధ్యాహ్నం విచారణ చేపడ్తారు. అవగాహన సదస్సులో రాష్ట్ర సమాచార కమిషనర్లు వీ.శ్రీనివాసరావు, మోహిసినా పర్వీన్, దేశాల భూపాల్ రెడ్డి, బోరెడ్డి అయోధ్య రెడ్డి పాల్గొంటారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో నిత్య తిరుకల్యాణపర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.22,66,488 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్య కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాస పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండనవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

స్వామిని దర్శించుకున్న గీతామూర్తి



పార్టీ నేతలతో ఆలయం వెలుపల గీతామూర్తి

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతమూర్తి దంపతులు కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆమె వెంట రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కాదూరి అచ్చయ్య, యాదిరెడ్డి, కిసాన్‌మోర్చ అధ్యక్షుడు కిషన్‌నాయక్, శ్యాంసుందర్, పట్నం శ్రీను, గుంటిపల్లి సత్యం, గుజ్జ రాంనర్సయ్య, వేముల నరేష్, కృష్ణ ఉన్నారు.

మధ్యలోనే పర్యటన ముగించుకొని..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థాన అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి స్వదేశానికి తిరిగి వచ్చారు. ఆయనతోపాటు డీఈవో (డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) దోర్బల భాస్కరశర్మ మంగళవారం విధుల్లో చేరారు. సెప్టెంబరు 25నుంచి మంగళవారం వరకు ఇద్దరూ విదేశాల్లో స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. వీరి పర్యటన ఈ నెలాఖరు వరకు ఉండగా దేవస్థానంలో ఇటీవల జరిగిన ఘటనల నేపథ్యంలో తిరిగి వచ్చారు.

నీటి లెక్కలు ఆన్‌లైన్‌లో



నీటి పన్ను లెక్కలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేసేందుకు మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ నీటి పన్ను వివరాలను ఆఫ్‌లైన్ (పుస్తకాలు/లెడ్జర్లు)లో నమోదు చేసేవారు. అయితే రికార్డులు చెరిగిపోవడం, కాగితాలు చినిగిపోవడంతో పన్ను సేకరణ, వివరాల వెల్లడిలో అయోమయం నెలకొనేది. ఇక మొన్నటి వరకూ మునిసిపల్ కుళాయిల ద్వారానే నీటి సరఫరా జరగగా, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారానూ పల్లెలతో పాటు పట్టణంలో పలు కాలనీలకు నీటి సరఫరా జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

మారుతున్న కాలంతోపాటు, అందుబాటులోకి వస్తున్న ఆధునిక సాంకేతికత చెల్లింపులన్నింటినీ డిజిటలైజ్ చేసింది. ఈ నేపథ్యంలో గృహ, వ్యాపార సంస్థల యజమానులు తమ ఆస్తులకు సంబంధించి పన్ను చెల్లింపులను ఆన్‌లైన్ ద్వారానే చేస్తున్నారు. ఆస్తి అందుకు మునిసిపాలిటీ లేదా కార్పొరేషన్ అసెస్‌మెంట్ నెంబరు జారీ చేసేది. సదరు నెంబరు ద్వారా ప్రపంచంలో ఎక్కడున్నా నేరుగా పన్ను చెల్లించే వీలుండేది. అయితే ఆస్తి పన్ను ఆన్‌లైన్లో చెల్లించిన యజమానులు నీటి పన్ను చెల్లించేందుకు సిద్ధపడగా, అసెస్‌మెంట్ నెంబరులేని కారణంగా ఆయా చెల్లింపులు తిరస్కరణకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మునిసిపాలిటీల పరిధిలోని నల్లాలన్నింటి వివరాలను ఆన్‌లైన్ చేయాలంటూ పురపాలక శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు.

పట్టణంలో 48 వార్డులు.. లక్షా నలభై వేల జనాభా

మిర్యాలగూడ మునిసిపాటీటీ పరిధిలో 48 వార్డులుండగా, జనాభా 1,40,720కు చేరింది. ఇక పట్టణంలో 20050 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. కమర్షియల్ కనెక్షన్స్ 76 ఉండగా మరో ఏడు ఇండస్ట్రియల్ కనెక్షన్స్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పట్టణానికి నిత్యం 14.50 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరుగుతోంది. పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌తోపాటు అవంతీపురంలోని మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా పట్టణానికి నీటి సరఫరా జరుగుతోంది. పట్టణ పరిధిలోని 70శాతం నల్లాలకు నిత్యం నీటి సరఫరా జరుగుతుండగా, 30శాతం రోజు విడిచి రోజు తాగు నీటిని గంట సేపు సరఫరా చేస్తున్నారు. ఇక పట్టణంలోని 48 వార్డులను 35 బ్లాకులుగా విభజించిన అధికారులు నల్లాలు, యజమానుల పూర్తి వివరాలను సేకరించి, వార్డు ఆఫీసర్ల సహకారంతో ఆన్‌లైన్లో పొందుపరిచి శాశ్వత (అసెస్‌మెంట్) నెంబరు జారీ చేయనున్నారు.



మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయం

నీటి లెక్కలిలా..

మిర్యాలగూడ పట్టణ పరిధిలో 387 చేతి పంపులు (బోర్లు) ఉండగా అందులో 358 వినియోగంలో ఉండగా, మరో 29 బోరు పంపులకు మరమ్మతులు చేయిస్తున్నారు. ఇక 97 పవర్ బోర్లలో 75 వినియోగంలో ఉండగా 22 పవర్ బోర్లు పని చేయడంలేదు. ఇక పట్టణంలోని 18 వాటర్ ట్యాంకులుండగా, నీటి ఎద్దడి ఏర్పడిన తరుణంలో ఆయా వార్డులకు నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్లను వినియోగించనున్నారు. మునిసిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకర్లతో పాటు అదనంగా అద్దె ట్యాంకర్లను వినియోగించనున్నారు.

వివరాలు సేకరిస్తున్న అధికారులు

నీటి ఎద్దడి రానివ్వం



ఆస్తి పన్ను తరహాలో నీటి పన్ను చెల్లింపులు ఆన్‌లైన్లో జరిపే విధంగా అవసరమైన చర్యలు చేపడుతున్నాం. మునిసిపల్ నల్లాలతోపాటు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వారా పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం పట్టణంలోని అన్ని కాలనీలకు మంచి నీటి సరఫరా జరుగుతోంది. అయితే నీటి లభ్యత, పైప్‌లైన్ల ఏర్పాటుకు అనుగుణంగా నీరందిస్తున్నాం. భవిష్యత్‌లో 24/7 నీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ ట్యాప్(డీడీఎఫ్‌టీ) విధానాన్ని పరిశీలిస్తున్నాం. నీటి వృథాను అరికట్టేందుకు పట్టణ ప్రజలు సహకరించాలి.

గణవేణి శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం



తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. పట్టణ పరిధిలోని చేతిపంపులు, పవర్ బోర్లన్నీ వినియోగంలోకి తేవడంతోపాటు, నీటి లభ్యత స్థలాలను గుర్తించి అందుకవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు అవసరమైన నీటిని సరఫరా చేయడంతోపాటు నీటిపన్ను చెల్లింపులను సులభతరం చేసేందుకు నల్లాలు, యజమానుల వివరాలను ఆన్‌లైన్లోకి ఎక్కిస్తున్నాం.

వెంకన్న, మునిసిపల్ ఇంజనీర్, మిర్యాలగూడ.

తలాపునే కృష్ణమ్మ.. అయినా సాగునీరేదీ?

● తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
● సమస్యలపై జనంబాటలో ఆరా



నెల్లికల్ లిఫ్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

తిరుమలగిరి(సాగర్), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తలాపునే కృష్ణమ్మ పారుతున్నా, ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించకపోవడం ప్రభుత్వాల వైఫల్యమేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మంగళవారం రాత్రి ఆమె నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని నెల్లికల్ లిఫ్టు పనులు జరుగుతున్న పంప్‌హౌస్ ప్రాంతానికి స్థానిక రైతులు, జాగృతి నాయకులతో కలిసి వచ్చారు. లిఫ్టు పనులు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులతో మాట్లాడి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులు సాగునీటికోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి నాటి సీఎం కేసీఆర్ ఎడమకాల్వ ద్వారా సాగునీరు అందని సుమారు 25వేల ఎకరాలకు నీరందించేలా నెల్లికల్ లిఫ్టును ప్రారంభించారన్నారు. ఈ క్రమంలోనే సాగర్ ఉపఎన్నిక ముందు శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే గత ప్రభుత్వంలో జిల్లా మంత్రిగా పనిచేసిన జగదీష్‌రెడ్డి త్వరగా పూర్తి చేయించాల్సినప్పటికీ పట్టించుకోలేదన్నారు. లిఫ్టును ఏడాది లోపు పూర్తి చేయిస్తానని, లేదంటే తన పదవికి రాజీనామా చేస్తానని అప్పట్లో మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన వాగ్దానాన్ని ఆమె గుర్తుచేశారు. లిఫ్టుకు శంకుస్థాపన చేసి సుమారు నాలుగున్నరేళ్లు దాటిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తున్నా, లిఫ్టు పూర్తిచేయడంలో ఆ పార్టీ చిత్తశుద్ధితో పనిచేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లిఫ్టు పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పత్తి రైతులతో ఆమె మాట్లాడారు. తిరుగు ప్రయాణంలో ఆమె సమ్మక్క సారక్క స్టేజీ వద్ద వన దేవతలకు పూజలు చేశారు. ఆమె వెంట స్థానిక రైతులు, జాగృతి నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్ ప్యాకేజీ అందజేయాలి

చందంపేట, నాంపల్లి: నక్కలగండి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూమి కోల్పోయిన రైతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందజేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె చందంపేట మండలంలోని నక్కలగండి, నాంపల్లి మండల పరిధిలోని లక్ష్మణాపురం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2005-06 సంవత్సరంలో ప్రారంభమైన నక్కలగండి ప్రాజెక్టు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నేటికీ పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. ప్రాజెక్టు పూర్తయితే నల్లగొండ జిల్లాలో మూడు లక్షల ఎకరాలకు సాగునీరు, అనేక గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. నల్లగొండ జిల్లాలో అనేక గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రాజెక్టు పూర్తయితేనే ఫ్లోరైడ్ శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మార్కెట్ ధరను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు ప్రారంభంలో మైనర్లుగా ఉన్న పిల్లలు ప్రస్తుతం మేజర్‌లుగా మారారని, వారికి కూడా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం నక్కలగండితండా ముంపు బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాంపల్లి మండల పరిధిలోని లక్ష్మణాపురం ప్రాజెక్టు పనులు నిలిచిపోవటంతో అక్కడికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. భూనిర్వాసితులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు ఇక్కడికి వచ్చానని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి లక్ష్మణాపురం బాధితులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం అందరం చర్చించి ఒక తేదీ నిర్ణయించుకుని నల్లగొండలోనైనా, హైదరాబాద్‌లోనైనా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి సాధించుకుందామని ఆమె హామీ ఇచ్చారు.

కొమ్మేపల్లి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి

దేవరకొండ: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొమ్మేపల్లి గిరిజన గురుకుల పాఠశాలను మంగళవారం కల్వకుంట్ల కవిత జనబాట కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. మొదటగా దేవరకొండ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కవిత కొమ్మేపల్లి గిరిజన బాలుర పాఠశాల, కళాశాలను సందర్శించారు. మొదటగా పాఠశాలను సందర్శించి ఇన్‌చార్జి ప్రిన్సిపల్ హనుమంతురెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

హాకీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నార్కట్‌పల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అక్కెనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఏడో తరగతి చదువుతున్న మర్రి జగదీశ్ అండర్ 14విభాగంలో, అండర్ 17 విభాగంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మనోజ్, శ్రీచరణ్ ఈ నెల 7వ తేదీన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు కరీం తెలిపారు. డిసెంబర్‌లో ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో వారు పాల్గొననున్నట్లు కరీం తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులు..

మిర్యాలగూడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంబీఏ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో 20మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దగ్గుబాటి విమల తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో నేవిరెడ్డి, నదియా, హాస్నీ, ఆరాధ్య, లోహిత, బాలుర విభాగంలో అక్షిత్‌రెడ్డి, తానిష్‌రతన్, దీపక్‌నాయుడు, కార్తికేయ, గయాసుద్దీన్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఇక అండర్-17 బాలికల విభాగంలో చందన, యశస్వినీ, చైత్ర, శ్రావ్య, ప్రియాంక, బాలుర విభాగంలో శశాంక్, అఖిలేష్, అన్విత్‌నిహాల్‌రెడ్డి, సాయిఉద్విఅభిరామ్, శుశాంత్ గౌతమ్‌లు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ మారబోయిన రామకృష్ణ, ప్రశాంత్, నవీన్‌కుమార్, శరన్‌కుమార్, వెంకటరెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా గుంతలు

● ప్రమాదం బారిన పడుతున్న వాహనాదారులు ● మరమ్మతు చేపట్టాలని వినతి



బస్వాపూర్ శివారులో కయ్యాలుగా మారిన రోడ్డు అంచులు

భువనగిరి రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో రోడ్డుకు ఇరువైపులా గుంతలు ప్రమాదకరంగా మారాయి. 2009లో భువనగిరి నుంచి హన్సేనాబాద్ మీదుగా బస్వాపూర్ గ్రామానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.58.50లక్షలతో సుమారు 5 కిలోమీటర్ల రహదారిని నిర్మించారు. అయితే ఎత్తైన ప్రదేశాల నుంచి వర్షం నీరు రహదారిపై ప్రవహిస్తూ రహదారి అంచులు కోతకు గురై పెద్దపెద్ద గుంతలుగా మారాయి. ఈ రోడ్డు గుండా భువనగిరి నుంచి హన్సేనాబాద్ మీదుగా బస్వాపూర్, ముత్తిరెడ్డిగూడెం, దాతరుపల్లి, రాళ్ల జనగాం, మల్లాపూర్ గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తారు. కాగా రాత్రి వేళల్లో ఆ రహదారి గుండా ప్రయాణిస్తున్న వాహనాదారులు ఎదురుగా వస్తున్న వాహనాలతో పక్కకు వెళ్తుండడంతో వాహనదారులు కిందపడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా భువనగిరి నుంచి బస్వాపూర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో ఈ ప్రాంతంలో బోల్తా పడడంతో నలుగురు వ్యక్తులు కూడా ఇటీవల ప్రమాదాల బారిన పడ్డారు. ఈ విషయమై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి ప్రాణాలను రక్షించాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



16 ఏళ్ల క్రితం నిర్మించిన రహదారి వెంట మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై పంచా యతీ రాజ్ అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. లేనట్లయితే 4 గ్రామాల ప్రజలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ తీరును ఎండగడుతాం.

-కస్తూరి పాండు , మదర్ డెయిరీ డైరెక్టర్, బస్వాపూర్

ప్రతిపాదనలు పంపాం

వరదలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే మరమ్మతు చేపడుతాం.

-శ్యాంసుందర్‌రెడ్డి, పంచాయతీరాజ్, ఏఈ, భువనగిరి

తెలుగు వారికి క్రీడలపై మక్కువ ఎక్కువ

● కలెక్టర్ ఇలా త్రిపాఠి ● సాగర్‌లో బీసీ గురుకులాల జిల్లాస్థాయి క్రీడలు ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నాగార్జునసాగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి క్రీడలపై మక్కువ ఎక్కువ అని నల్లగొండ కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులపాటు జరిగే బీసీ గురుకులాల అండర్-14, 19 క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు క్రీడలపై ఇష్టం ఎక్కువ ఉంటుందన్నారు. ఇందుకు ఉదాహరణ అజారుద్దీన్, మహ్మద్ షమీ, వీవీఎస్ లక్ష్మణ్‌లు క్రికెట్‌లో రాణించడమేనన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఉన్న బాలికల గురుకులాలను మాత్రమే సందర్శించానని, ఇకనుంచి బాలుర గురుకులాలను కూడా సందర్శించి, అక్కడి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ రాజశేఖర్, బీసీ గురుకులాల ఆర్‌సీవో స్వప్న, పెద్దవూర ఎంఈవో తరిరాములు, డీటీ శ్రీదేవి, నందికొండ మునిసిపల్ కమిషనర్ వేణు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, సాగర్ బీసీ గురుకుల ప్రిన్సిపల్ రవికుమార్, తుమ్మడం బీసీ బాలికల గురుకుల ప్రిన్సిపల్ భవాని, సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య, పీఈటీలు నరసింహ, జానకిరాములు, జిల్లాలో ఉన్న 14 బీసీ గురుకుల పాఠశాలలు, 16 బీసీ గురుకుల కళాశాలల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

నేరేడుచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పబ్బతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కొచ్చర్ల వేణు కోరారు. మంగళవారం మండలం లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, శౌరి, గోపయ్య, కట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

గరిడేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే సీఐటీయూ 4వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో శీలం శ్రీను, లలిత పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌కు కట్టుబడి ఉండాలి

హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని బీసీ సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు కోరారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నల్ల కండువాలతో నిరసన తెలిపి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌కు రెండేళ్లు నిండాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసు, కంబాల శ్రీను, జడ శ్రీను, అశోక్, సైదయ్య, బ్రహ్మాచారి, శ్రీను, రమణ, అఖిల్, పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం కృషి

తుంగతుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చి దేశాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా రెడ్డి అన్నారు. భారత దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఎండీ నజీరోద్దీన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా ముఫ్తి మొహమ్మద్ అహ్మద్, కళాశాల పాఠశాల సమన్వయకర్తలు రమేష్, ఎస్కే హబీబ్‌బాష పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ రూరల్: భారత మాజీ విద్యాశాఖ మంత్రి దివంగత మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు సాధించాలని ఎంపీడీవో సుమంత్‌రెడ్డి, ఎస్ఐ బండి మోహన్ కోరారు. మంగళవారం పట్టణంలోని గురుకుల మైనార్టీ పాఠశాలలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహనాబేగం, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వాముల నగర సంకీర్తన

హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్పస్వాముల నగర సంకీర్తన అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం హుజూర్‌నగర్‌లోని కోదాడ రోడ్డులోని శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయం నుంచి ఇందిర సెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా పాత బస్‌స్టేషన్, గాంధీపార్క్ నుంచి శివాలయం వరకు నగర సంకీర్తన నిర్వహించారు. 40 రోజుల పాటు దీక్షలో ఉన్న అయ్యప్ప, శివ మాలధారులు ఊరేగింపుగా తరలివచ్చి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు నగర సంకీర్తనలో పాల్గొని భక్తులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ చరమందరాజు, ఎస్ఐ బండి మోహన్, గురుస్వాములు సీఎస్ సురేందర్, పండ్ల హుస్సేన్, పెండ్యాల నాగేందర్, అట్లూరి హరిబాబు, జక్కుల నరేందర్, కిరణ్, రాము, వెంకటనారాయణ, పుల్లయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సామాజిక కార్యకర్తలు నక్కా. నరేష్, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు కోలపూడి యోహాన్ కోరారు. మంగళవారం పట్టణంలో పలు సమస్యలపై మునిసిపల్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని చిన్నముత్యాలమ్మ దేవాలయం వీధి, తిలక్‌నగర్, రామిశెట్టి బ్రహ్మం వీధి, 15, 16 వార్డుల్లోని ఈద్గా, మహా ప్రస్థానానికి వెళ్లే అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయన్నారు. డ్రైనేజీలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నం శ్రీనివాసరావు, మాధవరావు, శ్రీదేవి, కృష్ణ, సురేష్, సుజాత, శ్రీను, శైలజ తదితరులు పాల్గొన్నారు.

గణిత ఒలంపియాడ్‌లో 'జయ' విద్యార్థుల ప్రతిభ

కోదాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురానికి చెందిన రామానుజన్ గణిత అకాడమి నిర్వహించిన గణిత ఒలంపియాడ్‌లో కోదాడకు చెందిన జయ ఐఐటీ ఒలంపియాడ్ పాఠశాలకు చెందిన 19మంది విద్యార్థులు ప్రతిభ చూపి రెండో లెవల్‌కు అర్హత సాధించారని కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు.అర్హత సాధించిన విద్యార్థులు మంగళవారం పాఠశాలలో ఆయన అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, జెల్లా పద్మ బింగి జ్యోతి, ఉపాధ్యాయుడు సీహెచ్ వేణు పాల్గొన్నారు.

విద్యార్థినులు జాతీయ స్థాయిలో రాణించాలి

కోదాడ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము ఎంచుకొన్న క్రీడలో జాతీయ స్థాయిలో రాణించాలని ఎంఈవో ఎండీ సలీంషరీఫ్ అన్నారు. కోదాడ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోదాడలోని బాలికలు ఉన్నత పాఠశాలలో వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థినులను సన్మానించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.సైదులు, పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మఠంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టబడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈవో వెంకటాచారి అన్నారు.జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండలంలోని మఠంపల్లి, చౌటపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యారులకు సర్వమత సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులను ఎంఈవో స్థానిక నేతలు, ఉద్యోగులతో కలిసి ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆధూరి కిషోర్‌రెడ్డి, నాయకులు నాగుల్‌మీరా, వీరబాబు పాల్గొన్నారు.

మల్లమ్మ కుటుంబాన్ని ఆదుకుంటాం

పెన్‌పహాడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండాది మల్లమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. మంగళవారం మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు మండాది రమేష్‌గౌడ్ తల్లి మండాది మల్లమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లమ్మ విగ్రహాన్ని సర్వోత్తమ్ రెడ్డి, వేణారెడ్డిలు ఆవిష్కరించి, పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పోతు భాస్కర్, తూముల సురేష్‌రావు పాల్గొన్నారు.

మునిసిపల్ పారిశుధ్య కార్మికురాలు మృతి

హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ మునిసిపల్ కార్మికురాలు కస్తాల గోవిందమ్మ(50) మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. .మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ అకస్మికంగా మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గోవిందమ్మ మృతదేహానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను పూలమాల వేసి నివాళులర్పించి, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటాలు

నేరేడుచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికుల హక్కుల కోసం దేశ వ్యాప్తంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, సీఐటీయూ మండల గౌరవాధ్యక్షుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మండల మహాసభకు హాజరై మాట్లాడారు. . ఈ సమావేశంలో శీలా రాంమ్మూర్తి, కొండపల్లి వరలక్ష్మి, వెంకన్న, శ్రీను, రవీందర్ పాల్గొన్నారు.

వానొస్తే గండమే

- లోలెవల్ వంతెనలతో రాకపోకలకు ఇబ్బందులు
- వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న రహదారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

మోతె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్‌లో మోతె మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న లోలెవల్ వంతెనలపై నుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహనదారులు, పశువుల కాపరులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పరిస్థితిల్లో ఇలాంటి వంతెనలపై వెళ్లాల్సిన వారు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సంవత్సరాలు ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదు.

వరద ఉధృతికి కొట్టుకుపోయిన కల్వర్టు

మండలంలోని రావిపహాడ్ గ్రామంలో పెద్ద చెరువు కింద ఉన్న లోలెవల్ వంతెన పూర్తిగా ధ్వంసమై వరద ఉధృతిలో కొట్టుకుపోయింది. నామవరం నుంచి గుంజలూరుకు వెళ్లే రోడ్డులో రెండేళ్ల క్రితం లోవెల్ వంతెన నిర్మాణాన్ని ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా, అలుగు వచ్చినా ఈ వంతెనపై రెండు అడుగుల మేర వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ రోడ్డు నుంచి కోదాడ, సూర్యాపేట పరిధిలోని వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు, పశువులను మేతకు వెళ్లే రైతులు వరదను దాటలేక వారం రోజుల పాటు నిరీక్షించాల్సి వస్తోంది. ఇటీవల వచ్చిన వరదలకు వంతెనపై పగుళ్లు వచ్చాయి. విభలాపురం గ్రామ శివారులో ఉన్న గండ్లచెరువు వాగు ఎగువన చిన్నపాటి వర్షం కురిసినా, 200అడుగుల పరిధిలో ఉన్న ఈ లో లెవల్ వంతెనపై మూడు అడుగుల మేర వరద ప్రవహిస్తోంది. ఈ వరద వారం రోజుల పైబడి కొనసాగుతున్నందున 10గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతుతన్నారు. విభలాపురం వెళ్లాలంటే 10కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేసి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.. సిరికొండ నుంచి రావిపహాడ్ వెళ్లే మార్గంలో పొలాల నుంచి చెరువుల నుంచి రోడ్డు పైకి వరద వచ్చినందున ఆ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. నర్సింహాపురం-ఉర్లుగొండ గ్రామాల మధ్య కిలోమీటరు పరిధిలో ఉన్న ఈ లోలెవల్ వంతెనను టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేశారు. ఎగువ నుంచి పాలేరుకు వరద వచ్చినప్పుడల్లా వంతెనపైకి నీరు వస్తోంది. దీంతో వంతెనపై గుంతలు పడి రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

హైలెవల్ వంతెనలకు మోక్షం ఎప్పుడో...

మండలంలోని మామిళ్లగూడెంనుంచి విభలాపురం వెళ్లే మార్గంలో లెవల్ వంతెన, హైలెవల్ వంతెన నిర్మించేందుకు ఏడాది క్రితం గోతులు తవ్వారు. ఎక్స్‌కవేటర్లతో కాంట్రాక్టర్ పనులు ప్రాంభించి మధ్యలోనే వదిలేశాడు. నామవరం గ్రామ శివారులో లోలెవల్ వంతెన నిర్మాణం సమయంలో హైలెవల్ వంతెనను నిర్మిస్తేనే వర్షాకాలంలో ప్రమాదం జరగదని విన్నవించా కాంట్రాక్టర్, ప్రస్తుత పీఆర్ ఎఈ కలిసి అసంపూర్తి నిర్మాణం చేపట్టారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదం జరగకుండా హైలెవల్ వంతెనను నాణ్యతతో నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. రావిపహాడ్ పెద్దచెరువు వద్ద రోడ్డు వరద ఉధృతికి పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పీఆర్ అధికారులను వివరణ కోరే యత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.



మోతె మండలం నామవరం-గుంజలూరు మార్గంలో లోలెవల్ వంతెనపై ప్రవహిస్తున్న వరద (ఫైల్ ఫొటో)

హైలెవల్ వంతెనను నిర్మించాలి



మండలంలో ఇటీవల కురిసిన వర్షాలతో ఇబ్బంది పడ్డాం. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన లోలెవల్ వంతెనలతో అవస్థలు పడుతున్నాం. ఏడాది కిత్రం ఎండ్ల బండితో విభలాపురం వాగు వరదను దాటుతూ, ఉధృతికి ఎద్దుతో పాటు రైతు ప్రాణాలు కోల్పోయాడు. రావిపహడ్ వంతెన పూర్తిగా కూలింది. నిర్మాణం చేపట్టిన, కాంట్రాక్టర్, అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. నామవరం - గుంజలూరుకు వెళ్లే మార్గంలో లెవల్ వంతెనను అసంపూర్తిగా నిర్మించారు. ప్రభుత్వం స్పందించి లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెనలను నాణ్యతతో నిర్మించాలి.

● సరసాని సుధాకర్‌రెడ్డి, రైతు, నామవరం

అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరని లోటు



సూర్యాపేటలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీసీ జేఏసీ నాయకులు

సూర్యాపేటటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ మృతి సాహితీ లోకానికి తీరని లోటని బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జోతిరావుఫూలే విగ్రహం వద్ద అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించి మాట్లాడారు. ప్రకృతిలో ఓనమాలు నేర్చుకున్న అందెశ్రీ బడుగుబలహీన వర్గాల జీవితాన్ని తన రచనతో ప్రపంచానికి చాటారన్నారు. తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడం ఆయనకు ఇచ్చిన బిరుదుగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బారీ అశోక్, దుర్గం ప్రసాద్‌రాజు, గణేష్, రమేష్, వెంకన్న, కిరణ్, చారి, నాగేంద్రబాబు, మహేష్ పాల్గొన్నారు

● హుజూర్‌నగర్: ప్రజాకవి అందెశ్రీ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని స్పందన నాట్య కళామండలి అధ్యక్షుడు కొట్టు బాబు, గుంటి పిచ్చయ్య, రామకృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో అందెశ్రీ సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆకుల రాము, వెంకటేశ్వర్లు, రామకృష్ణప్రసాద్, ధనమ్మ, రాము పాల్గొన్నారు.

● తిరుమలగిరి రూరల్: అందెశ్రీ మృతి సమాజానికి తీరని లోటని మాజీ ఎంపీటీ తాటిపాముల గ్రామంలో బేతు ప్రవీణ్ ఆధ్వర్యంలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మట్లాడారు. కార్యక్రమంలో గీత సంఘం అధ్యక్షుడు వీరస్వామి, రాములు, భిక్షం, సోమనర్సయ్య, కృష్ణ, వెంకన్న, మొగులయ్య, వెంకటయ్య, మల్లయ్య, యాదగిరి, మనోజ్, గణేష్ పాల్గొన్నారు.

సబ్‌మార్కెట్ పడావు

(5వ పేజీ తరువాయి)

అయితే సిబ్బందిని నియమించకపోవడంతో ఎలాంటి కొనుగోళ్లు చేపట్టలేదు. తదనంతరం కూడా రైతులు సబ్‌మార్కెట్‌కు బదులు తమకు సాగు పెట్టుబడిగా చేదులు ఇచ్చే వ్యాపారులకే పంటను విక్రయించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో సబ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. మండలంలో 20 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నా సబ్ మార్కెట్‌లో ఇప్పటి వరకు ఒక్క గింజ కూడా క్రయవిక్రయాలు సాగలేదు.

వినియోగంలేని స్థలంలో గోదాంలు

రెండు దశాబ్దాలుగా వినియోగంలో లేని సబ్‌మార్కెట్‌లో ఐదేళ్ల కిందట రూ.2 కోట్లతో గోదాంలు నిర్మించారు. క్రయవిక్రయాలు లేని చోట గోదాంలు ఎందుకు నిర్మించారో అర్థంకావడం లేదని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కమీషన్ల కోసమే తరుచూ మరమ్మతులంటూ, కొత్త నిర్మాణాలను చేపడుతున్నారని ధ్వజమెత్తుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా సబ్‌మార్కెట్ దశ మాత్రం మారడం లేదు.

వ్యాపారులదే హవా

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో చేతికందే దశలో వరుస వర్షాలు రైతులను మరింత కుంగదీస్తున్నాయి. వాతావరణ పరిస్థితులతో పంటను దక్కించుకునేందుకు రైతులు పచ్చిధాన్యాన్ని విక్రయించాల్సి వస్తోంది. ఐకేపీ, పీఏసీఎస్, వ్యవసాయ మార్కెట్లలో తేమ శాతం అడ్డంకిగా మారడంతో రైతులు దళారులను, కమీషన్ ఏజెంట్లను నమ్ముకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో మద్దతు ధరకన్నా తక్కువకు పంటలను విక్రయిస్తూ నష్టపోతున్నారు. సబ్ మార్కెట్ వినియోగంలో ఉంటే రైతులకు ఇంత నష్టం కలిగి ఉండేది కాదని రైతు సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సబ్‌మార్కెట్ యార్డును వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తక్కువ ధరకే విక్రయిస్తున్నారు

సబ్‌మార్కెట్ అందుబాటులో లేక పంటలను తక్కువ ధరకు విక్రయించి ఇబ్బంది పడుతున్నాం. దళారులు తక్కువ ధరలకే కొనుగోలు చేస్తున్నారు. వరి, పత్తి కొనుగోలు కేంద్రాలు లేక తప్పనిసరి పరిస్థితిలో దళారులకు విక్రయించాల్సి వస్తోంది. తేమ పేరుతో కూడా మోసం చేస్తున్నారు. ప్రభుత్వం సబ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి

● మాలోతు సక్యనాయక్

రైతు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తా

రైతుల సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్తా. కొనుగోలు కేంద్రాలు లేక మద్దతు ధర పొందలేకపోతున్నారు. రానున్న కాలంలో వరి, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తా. మంత్రి ద్వారా నిధులు మంజూరు చేయించి మఠంపల్లి సబ్‌మార్కెట్ యార్డును ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.

● ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మఠంపల్లి

పీహెచ్‌సీలో పోస్టులను భర్తీ చేయాలి

మఠంపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం, వ్యకాస, గిరిజన సంఘం, సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయా సంఘాల నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉద్యోగులు, సిబ్బంది అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని, డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించాలని, మందుల కొరతను నివారించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలను ఉద్యోగ భద్రత కల్పించాలని, మఠంపల్లి ప్రాథమిక వైద్యశాలను 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేసి, వైద్యులను నియమించి 24గంటల వైద్య సౌకర్యం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు భూక్యా పాండునాయక్, మాలోతు బాలునాయక్, నున్న గోకుల, లక్ష్మమ్మ, కంటు కోటయ్య, పి.రాము, వెంకటరెడ్డి, భూక్యా శేషునాయక్ తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

తేమ లేకుండా ఆరబెట్టి ధాన్యం విక్రయించాలి




కందగట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఏవో నివేదిత

ఆత్మకూర్(ఎస్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్వరగా కాంటాలు వేసి రైతుల ధాన్యాన్ని విక్రయాలు చేయాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి నివేదిత అన్నారు. మంగళవారం మండలంలోని కందగట్ల శివారు మంగలితండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేమశాతం 17 వరకు ఉండేలా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు, అకాల వర్షాలతో ఇబ్బందులు కాకుండా ధాన్యాన్ని త్వరగా విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో దివ్య, నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

15న లోక్ అదాలత్

మునగాల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కోదాడ కోర్టు ఆవరణంలో ఈ నెల 15న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మునగాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరువర్గాలు రాజీ చేసుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమని అన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హుజూర్‌నగర్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీడీఓ సుమంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లింగగిరి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించి మాట్లాడారు.. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

నేరేడుచర్ల: మండలంలోని సోమారం గ్రామం వద్ద మూసీ నదిలో ఇటీవల వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన సుస్మిత మృతదేహన్ని ఈదుకుంటూ వెళ్లి తీసుకువచ్చిన నేరేడుచర్ల ఎస్ఐని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సన్మానించారు. ఆయన ధైర్య సాహసాలను కొనియాడారు. సన్మానించిన వారిలో రమావత్ పాండునాయక్, దేవులపల్లి శంకరాచారి, చింతమళ్ల సైదులు, నాగార్జునస్వామి ఉన్నారు.

ఆలయంలో కార్తీక వన భోజనం

హుజూర్‌నగర్: మండలంలోని బూరుగడ్డ దేవాలయంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు ఆధ్వర్యంలో కార్తీకవన భోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీవేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, సాముల శివారెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాధికఅరుణ్‌కుమార్, సిద్ధార్థ రెడ్డి, అనిల్‌కుమార్, అశోక్, సీతమ్మ, ఉష, రౌతు వెంకటేశ్వరరావు, ముత్తవరపు పాండురంగారావు, గొట్టె రామయ్య, తన్నీరు మల్లికార్జున్, ఆదెర్ల శ్రీనివాసరెడ్డి, గోపాల్‌నాయక్, జక్కుల మల్లయ్య పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

మద్దిరాల: దేశంలో జనాభాలో సగం శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్‌పార్టీ జోనల్ ఇన్‌చార్జి దయాకర్‌మౌర్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరి జనాభా ఎంతో వారికంతా వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలు అన్ని రంగాలల్లో వెనకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చెరుకుపల్లి లక్ష్మణ్, బరపటి ఉపేందర్, ఎర్ర రాంబాబు, నిర్మల పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

హుజూర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చవగాని సైదులు కోరారు. లక్కవరం గ్రామానికి చెందిన తుమ్మల నరేందర్‌కు మంజూరైన రూ.1.75లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మధుగౌడ్, గురుపాదం పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్ రూరల్: మండల పరిధిలోని బూరుగడ్డ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర పాలకుడు ఆంజనేయుడికి ఆకుపూజ, గంధ సింధూరం, వడపప్పు, పులిహోర తదితర ప్రసాదాలు నివేదించారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, గూడెపు శ్రీనివాసు, దినేష్, గణేష్, అనురాధ, ప్రభాకర్, లింగబాబు, సావిత్రి, సత్యవతి, సాయిచరణ్, రమాదేవి, హరీష్‌కుమారాచార్యులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూములను కాపాడాలి

మఠంపల్లి: మండలంలోని పెదవీడు ఊర చెరువు, చింతలమ్మ చెరువు శిఖం భూములను కబ్జాల నుంచి కాపాడాలని పెదవీడు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చిలక దేవభిక్షం కోరారు. రాష్ట్ర ఐడీసీ అధికారులకు మంగళవారం ఆయన ఫిర్యాదు చేశారు. పెదవీడు చెరువు 196 ఎకరాల విస్తీర్ణం ఉండగా నేడు 126 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. , అదే విధంగా చింతలమ్మ చెరువు కూడా 30 ఎకరాలు కబ్జాకు గురైందన్నారు. అధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి శిఖం భూములను కాపాడాలని, లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

నూతనకల్: ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంపీడీవో సునీత కోరారు. మంగళవారం మండలంలోని తాళ్లసింగారం గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, ఐకేపీ కేంద్రాలను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలకు అందించే బియ్యాన్ని నిల్వ చేసే ప్రదేశం పరిశుభ్రంగా ఉండాలన్నారు. గోదాం నుంచి నాణ్యమైన బియ్యం రాకపోతే వెంటనే హెచ్ఎంలు తమకు తెలపాలన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు ఉన్నారు.

శిక్షణ పొందిన తేజ ఉపాధ్యాయులు

కోదాడ రూరల్: న్యూఢిల్లీలోని శ్రీ అరవిందో ఆశ్రమంలో మండలంలోని కొమరబండ తేజ విద్యాలయం ఉపాధ్యాయులు మల్లీశ్వరి, కుమారి తిరుమలలు అక్టోబరు 30వ తేదీ నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శిక్షణ పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా 38 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారని, జాతీయస్థాయిలో విద్యలో వస్తున్న మార్పులను, విద్యార్థులకు చక్కగా ఆటల ద్వారా పాఠాలు బోధించే విధానాలను నేర్పాలని శిక్షణలో సూచించారన్నారు. అరబిందో ఆశ్రమ యాజమాన్యం వ్యాయామ విద్యకు సంబంధించి రూ.20వేల విలువైన సామగ్రిని పాఠశాలకు అందించిందని తెలిపారు.

16న కార్తీక వన భోజనాలు

అనంతగిరి: కాకతీయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోదాడలో ఈ నెల 16వ తేదీన నిర్వహించే కార్తీక వన భోజనాలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. మంగళవారం అనంతగిరి మండలంలోని వాయిలసింగారం గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నలజాల శ్రీనివాసరావు, సాతులూరి హనుమంతరావు, కర్రి సుబ్బారావు, చిట్టిబాబు, కొల్లు సుబ్బారావు హనుమంతు లక్ష్మీనరసింహారావు, గద్దె శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్ టీ షర్ట్‌ల పంపిణీ

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ స్టేజీ విజయనగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమి పాఠశాల విద్యార్థులకు అయ్యవారికుంట తండా ప్రధానోపాధ్యాయులు రమేష్ సహకారంతో మంగళవారం టీషర్ట్ పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ చేతుల మీదుగా విద్యార్థులకు డ్రస్సులను అందజేశారు. రాజస్థాన్ కు చెందిన రమేష్ మిత్రుడు దేవిలాల్, కమలేష్, అశోక్ ల సౌజన్యంతో విద్యార్థులకు సహకరించడం పట్ల డీఈవో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూర్(ఎస్) మండల విద్యాధికారి ధారాసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొదిల జ్యోతి, మాలే జానకిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

పెన్‌పహాడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తేమ శాతం పేరుతో రైతులను మోసం చేస్తే సహించేది లేదన్నారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గుంజ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

కబడ్డీలో ఎంపికైన విద్యార్థులకు అభినందన

మోతె, నవంబరు11 (ఆంధ్రజ్యోతి)కొత్తగూడెం జిల్లా ఏడూళ్లబయ్యారంలో రాష్ట్ర స్థాయిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో కబడ్డీ అండర్ - 17 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టులో ఆడిన ఆడిన మోతె మండలం నామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మదూరి దీక్షిత, నిమ్మరబోయిన వర్షిత, గాయం వైష్ణవిలు ద్వితీయస్థానం సాధించారు. గత నెలలో హైదరాబాద్‌లోని పఠాన్‌చెరువులో నిర్వహించిన కబడ్డీ అండర్-14 విభాగంలో పాఠశాల విద్యార్థిని గాయం శ్రావణి పాల్గొంది. ఈ విద్యార్థినులను మంగళవారం పాఠశాలలో జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

అద్దెల కోసం నిరీక్షణ

(5వ పేజీ తరువాయి)

రూ. 4 నుంచి రూ.5లక్షల వరకు బకాయిలు ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు వస్తాయే అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటు భవనాన్ని ఖాళీ చేయిస్తే ఎక్కడ బకాయి అద్దె రాదో అని, భవనాన్ని కిరాయికి కొనసాగిస్తే రోజురోజుకు భవన అద్దెలు పెరుగుతుండడం వారికి ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి కనిపిస్తోంది. అద్దెలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షల్లో బకాయిలు ఉండడంతో ప్రభుత్వం అద్దెలు చెల్లించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం

అద్దె బకాయి విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతాం. త్వరలో సమస్యను పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది.

● అశోక్, డీఈవో, సూర్యాపేట